క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జె.పంగులూరు: పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ జేఈ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్కరణలో భాగంగా పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో సర్క్యూట్ బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకి: విద్యార్థులు పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు గ్రంథాలయాధికారి బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. 15 మంది విద్యార్థులు పాల్గొని దేశభక్తి, జానపదకథల పుస్తకాలు చదివారు.

నేటి నుంచి మాలధారులకు చద్ది

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నిదానం పాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు మాలధారులకు చద్ది ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వంకాయలపాటి సుబ్బారావు ఆదివారం తెలిపారు. దాతలు.. మార్టూరుకు చెందిన పుట్టా చంద్రశేఖర్, పూనూరు వాస్తవ్యులు గవిని వెంకట్రావు ఆర్థిక సాయంతో ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం జరుగుతుందని చెప్పారు. అయ్యప్ప, భవాని, శివ, లక్ష్మీమాలధారులతో పాటు వివిధ రకాల మాలలు ధరించిన భక్తులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

నిత్యావసరాల అందజేత



సరుకులు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు, ఇంకొల్లు మండలాల్లోని ఆశ్రయ వృద్ధాశ్రమాలను ఫ్రెండ్స్ హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం సందర్శించారు. ఆశ్రమాల పనితీరును గమనించి రెండు ఆశ్రమాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రతి నెల రూ. 10 వేలు విలువ కలిగిన నిత్యావసర వస్తువులు అందిస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ప్రతినిధులు దుర్గ, అనిల్, ఆశ్రమ నిర్వాహకులు భవనం జయలక్ష్మి, సాయి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాత, రక్తదాన ప్రోత్సాహకుడు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో ఆదివారం రక్తహీనతతో బాధపడుతున్న మహిళకు దాత రక్తదానం చేశారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న కటారపు ప్రసన్నకు వ్యవసాయశాఖలో పనిచేస్తున్న వినుకొండ శివచంద్రకుమార్ రక్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, వైరమేష్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ అక్కయ్య చౌదరి మృతి



యార్లగడ్డ అక్కయ్య చౌదరి

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ అక్కయ్య చౌదరి (66) ఆదివారం గుండెపోటులో మృతిచెందారు. ఉదయం ఉత్సాహంగానే ఉన్న ఆయన మధ్యాహ్నం ఒక్కసారిగా గుండెపోటుకు గురై మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన గతంలో కారంచేడు గ్రామ వార్డు సభ్యునిగా, పాలకేంద్రం అధ్యక్షుని గాను, ఎంపీటీసీగా, ఎంపీపీగా పనిచేశారు. అనంతరం ఆయన పర్చూరు ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కారంచేడు ఎంపీటీసీ సభ్యునిగా ఉన్నారు. అక్కయ్య చౌదరికి భార్య వెంకటరత్నంతో పాటు వివాహం అయిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

ఏ క్షణం.. ఏమవుతుందో!



పూనూరు పశువైద్యశాల



నెర్రెలిచ్చిన గోడలు,పై కప్పు పై మొలచిన మొక్కలు

- శిథిలావస్థలో పూనూరు పశువైద్యశాల
- పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న భవనం
- వర్షాలకు తడిసిపోతున్న వైద్యపరికరాలు, మందులు
- ఏక్షణాన కూలుతుందోనని భయాందోళనలో సిబ్బంది
- నూతన భవనం నిర్మించాలంటున్న పశుపోషకులు

యద్దనపూడి: రైతులకు సాగు తరువాత వారి ప్రధాన వృత్తి పాడిపరిశ్రమ. దీనిని ఆధారం చేసుకొని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అలాంటిది శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల వల్ల పశువైద్యం గాలిలో దీపంలా మారింది. నోరులేని మూగజీవాల ఆక్రందనను ప్రభుత్వం విస్మరిస్తోంది. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన పశువైద్యశాల పూర్తి శిథిలావస్థకు చేరుకున్నా కనీస మరమ్మతులకైనా సర్కారు కాసులు విదిలించలేదు. ప్రస్తుతం ఆ భవనం కూలేదశలో ఉందని నూతన భవనం నిర్మించాలని క్షేత్రస్థాయి నుంచి ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించటం లేదు.

1971లో..

పూనూరు పశువైద్యశాల ఎంతో ప్రసిద్ధి చెందింది. 1971లో బత్తుల రామయ్య మెమోరియల్ పశువైద్యశాల కోసం దాత గన్నమనేని గాంధీచౌదరి ఒక



తడిసిపోతున్న వైద్యపరికరాలు, మందులు

ఎకరా స్థలం కేటాయించగా.. అందులో 8 సెంట్ల స్థలంలో పశువైద్యశాలను నిర్మించారు. అప్పట్లో పూనూరుతో పాటు చింతగుంటపాలెం, గన్నవరం, మున్నంగివారిపాలెం, తనుబొద్దివారిపాలెం, చిమటవారిపాలెం గ్రామాల్లోని పశుపోషకులు వైద్యసేవల నిమిత్తం ఈ ఆసుపత్రికి వచ్చేవారు. ప్రస్తుతం 50 సంవత్సరాలు దాటడంతో ఆ భవనం గోడలు నెర్రెలిచ్చాయి. పై కప్పు పూర్తిగా దెబ్బతింది. తలుపులు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి. భవనం శ్లాబుపై చెట్లు మొలచి వర్షం నీరు నిలిచి భవనమంతా ఉరుస్తోంది. దీంతో వైద్యశాలలో ఉన్న ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు మందులు, పశువుల దాణా కాపాడుకోలేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే భవనం ఏ క్షణాన కూలిపోతుందో తెలియక సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థ భవనాన్ని తొలగించి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా నూతన భవనాన్ని నిర్మించి జీవాలకు వైద్యసేవలు అందిచేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చువ్వలు బయటపడిన ఆసుపత్రిలోని వరండా



నూతన భవనం నిర్మించాలి:
యాభై సంవత్సరాలకు పైగా ఉన్న పశువైద్యశాల పస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. తక్షణమే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలి.
– వసువులేటి సుబ్బారావు: పూనూరు



వెంటనే నిధులు మంజూరు చేయాలి:
పశువైద్యశాల నూతన భవనానికి వెంటనే నిధులు విడుదల చేయాలి. పశువైద్య సిబ్బందితో పాటు వైద్యశాలకు వచ్చే వారు కూడా అనేక అవస్థలు పడుతున్నారు. తక్షణమే కొత్త పశువైద్యశాలను నిర్మించి మూగజీవాలకు వైద్యసేవలు అందించేలా చూడాలి.
– పి. మార్కండేయులు: పూనూరు

వస్తువులపై అవగాహన అవసరం

చీరాల అర్బన్: వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల పట్ల అవగాహన కలిగి ఉండాలని తూనికలు, కొలతల శాఖ డిప్యూటి కంట్రోలర్ కె.ఐజక్ అన్నారు. ఆదివారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద తూనికలు, కొలతల శాఖ బాపట్ల జిల్లా, వినియోగదారుల సమాచార కేంద్రం బాపట్ల ఆధ్వర్యంలో తూనికలు, కొలతలకు సంబంధించి వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటి కంట్రోలర్ ఐజక్ మాట్లాడుతూ కొనుగోలు చేసే వస్తువులు తగినంత బరువు, నాణ్యతతో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలన్నారు. చీరాల కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు వివిధ రకాలైన పాత్రలను వినియోగించి కూరగాయలు తూకం వేస్తున్నారని తెలిపారు. కాటా వేసేటప్పుడు పాత్రతో సహా సున్నా చూపించాలని కానీ కొందరు వ్యాపారస్తులు గిన్నెలతో సహా బరువు తూయడం గమనించామన్నారు. ఇలా చేస్తే వ్యాపారులపై



ఎలక్ట్రానిక్ కాటాలో తూనిక రాళ్లు పరిశీలిస్తున్న అధికారులు

కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబర్ 1967కు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ కంట్రోలర్ పి.లిల్లీ మాట్లాడుతూ వినియోగదారులు ప్రతి ఒక్కరూ కూరగాయలు, మాంసం, పండ్లు, చేపలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసే ముందు తగినంత బరువు ఉందో లేదో పరిశీలించాలన్నారు. డీసీఐసీ కన్వీనర్ డి.ఇమ్మానియేలు మాట్లాడుతూ వినియోగదారులు మార్కెట్‌లో తూకం ద్వారా కొనుగోలు చేస్తే వస్తువులు, ప్యాకింగ్ చేసిన వస్తువులు, మంచి నూనె, పప్పులు, బియ్యం తగినంత బరువు, పరిమాణాన్ని పరిశీలించాలన్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు అయినా వినియోగదారులు స్వయంగా తాము కొనుగోలు చేసిన వస్తువులను పరిక్షించుకోవాలని, ఏదైనా లోపం జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మార్కెట్‌లోని కూరగాయలు, మాంసం, చేపలు దుకాణాల్లో తూనిక పరికరాలను పరిశీలించారు. సాంకేతిక సహాయకుడు బేగ్, మేలుకొలుపు వినియోగదారుల సంఘం సభ్యులు ఆర్.లక్ష్మీనారాయణ, తూనికలు, కొలతలు శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కూరగాయల మార్కెట్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి



కుంకలమర్రులో సభ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న లక్ష్మీనర్సయ్య



కొణిదెనలో కరపత్రాల ఆవిష్కరణ

కుంకలమర్రు (కారంచేడు): ఈనెల 11న ఒంగోలులో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనర్సయ్య అన్నారు. ఆదివారం కుంకలమర్రులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సన్నాహక కార్యక్రమంలో మాట్లాడారు. సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ హాజరవుతున్నారన్నారు. 1994 జూలై 7వ తేదీన ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని మందా కృష్ణమాదిగ నాయకత్వంలో స్థాపించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో అవమానాలు, అవహేళనలను ఎదుకొని 30 సంవత్సరాల పాటు ఎస్సీలుగా ఉన్న 59 కులాలకు వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం ఫలాలు దక్కేలా పోరాలు చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పుణేష్, జక్రయ్య, యోహాను గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

బల్లికురవ: ఒంగోలులో నవంబర్ 11న జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి గ్రామాల వారీగా తరలిరావాలని బాపట్ల జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు దుండు వందనం పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం కొణిదెన గ్రామంలోని ఎస్టీకాలనీలోని కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఈ సమ్మేళనానిక ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్ఆర్‌పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కందుతూరు పేతురు మాదిగ, బండి బాబూరావు, మందా వీరయ్య, జంధ్రాజుపల్లి పెద దేవదాసు, గెల్లా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మణిరెడ్డికి ఘన స్వాగతం



క్రీడాకారుడిని అభినందిస్తున్న ప్రముఖులు

చినగంజాం: చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఆంధ్రకేసరి ప్రకాశం యూనివర్సిటీ టీం తరఫున పాల్గొన్న మణిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఆదివారం బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. క్లబ్ సభ్యులు ప్రెసిడెంట్ గిరిబాబు, సీనియర్ క్రీడాకారుడు, ఐటీ టాక్స్ అసిస్టెంట్ కంసని సతీష్ రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు, చీరల మోడల్ స్కూల్ లో పీఈటీ గా పని చేస్తున్న శివారెడ్డి, దేశం సుబ్బారెడ్డి, భోగిరెడ్డి నాగాంజనేయులు మణిరెడ్డికి రూ.5000 నగదు బహుమతి అందజేశారు.

లక్ష్యాన్ని ఎంచుకొని రాణించాలి



పరుపులు అందుకున్న విద్యార్థులు

వేటపాలెం: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదువుల్లో రాణించాలని పూర మస్తాన్‌రావు పేర్కొన్నారు. స్థానిక గొల్లపూడి వారి వీధిలోగల జీవీకేసీ స్వామి దయానం సేవాశ్రమం గల విద్యార్థులకు పూర మస్తాన్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 కి పరుపులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్ట భద్రుల సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మస్తాన్‌రావు సేవలను కొనియాడారు. చీరాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మధ్యాహ్నం పూట ఉచిత భోజనం అందజేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు పరుపులు అందజేయాలని కోరగానే పరుపులు అందించిన ట్రస్టు యజమానికి కృతజ్ఞతలు తెలిపారు. దాతల అందజేసిన సహకారంతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. సంఘ సభ్యులు దిలీప్ కుమార్, మాస్తాన్ రెడ్డి, పూల శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, సుబ్బారావు, లలిత, సేవక్ సుబ్రహ్మణ్యం, లక్ష్మి, వీరమ్మ కృష్ణ పాల్గొన్నారు.

నేడు ట్రాన్స్‌ఫార్మర్ల అందజేత

అద్దంకి రూరల్: మండలంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్న 70 మంది లబ్ధిదారులకు 25 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని వాటిని సోమవారం నుంచి అందజేయనున్నట్లు ఆదివారం ఏఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా వెంపరాల, కుంకుపాడు గ్రామాలకు చెందిన రైతులకు, దొంగతనానికి గురి అయిన ట్రాన్స్‌ఫార్మర్లు కూడా త్వరగా మార్చుకొనేందుకు సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండగ



ఊరేగింపుగా వస్తున్నదృశ్యం

పర్చూరు (ఆదివారం): ఉప్పుటూరులో ముస్లిం సోదరులు గ్యార్మీ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం రాత్రి వివిధ రకాల పూలతో తయారు చేసి అందంగా అలంకరించిన మహబూబ్ సుభాని జెండాను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశిష్ట అద్భుతాలు కలిగిన అల్లా భక్తుడు మహబూబ్ సుభాని పుట్టినరోజు సందర్భంగా ఈపండగను జరుపుకుంటారని మసీదు పెద్దలు తెలిపారు. జెండా ఊరేగిస్తున్న సమయంలో భక్తి పాటలతో యువకులు కేరింతలు కొడుతూ నృత్యం చేశారు.

పంక్చర్ దుకాణంలో చోరీ

అద్దంకి రూరల్: మండలంలోని ధర్మవరం ఇండియన్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న లారీ పంక్చర్ షాపు బయట ఉంచిన లారీ, ట్రాక్టర్, ఆటో డిస్కులు గుర్తు తెలియని వ్యక్తులు అక్టోబర్ 30వ తేదీ అర్ధరాత్రి దొంగిలించారు. షాపు యజమాని గుంజి హరిబాబు ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని ధర్మవరం ఇండియన్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న పంక్చర్ షాపులో లారీ, ట్రాక్టర్, ఆటోల డిస్కులు 30వ తేదీ రాత్రి ఇంటికి వెళుతూ షాపు బయట ఉంచి వెళ్లాడు. ఈ క్రమంలో 31 ఉదయం షాపు వద్దకు వచ్చి చూడగా ఆ వస్తువులు ఏమీ కనబడలేదు. చుట్టుపక్కలవారిని విచారించి, ఆదివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శివనామస్మరణతో శివాలయాలు



చెన్నుపల్లిలో శివుని అభిషేకం చేస్తున్న అర్చకుడు

బల్లికురవ: హరహరమహాదేవ శంభో శంకర అంటూ మండలంలోని ఆలయాలు హోరెత్తుతున్నాయి. ఆదివారం చెన్నుపల్లి, కొండాయపాలెం, నక్కబొక్కలపాడు, కొణిదెన, వేమవరం, గుంటుపల్లి, చినఅంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, సూరేపల్లి, వైదన, కొప్పెరపాడు గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం 5 గంటల నుంచే శివునికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాత్రికి ఓం నమఃశివాయంటూ భజనలు చేపడుతున్నారు.

కార్తీకమాసం స్నానాలకు బందోబస్తు



వాడరేవులో సిబ్బందికి సూచనలిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు

చీరాల టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వాడరేవు, రామాపురం సముద్రతీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పటిష్టంగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని రూరల్ సీఐ శేషగిరిరావు తెలిపారు. కార్తీక మాసం స్నానాలను పురస్కరించుకుని ఆదివారం చీరాల రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందితో వాడరేవు తీరం వద్ద ఏర్పాటు చేసిన ఔట్‌పోస్టు వద్ద బందోబస్తుకు సిబ్బందిని కేటాయించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ సముద్ర స్నానాలకు చీరాల వాడరేవు, రామాపురం తదితర తీరప్రాంతాలకు వేలాది మంది పర్యాటకులు బాపట్ల జిల్లా, పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు వేలాదిగా వస్తారని తెలిపారు. తీరప్రాంతాలకు వచ్చే భక్తుల రక్షణ కోసం పోలీసులు పటిష్టంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సముద్రతీరప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ, బీట్లు, గజ ఈతగాళ్ల, వాచ్ టవర్, ప్రత్యేకంగా ఔట్ పోస్టును ఏర్పాటు చేశామన్నారు. కార్తీక స్నానాలు పూర్తి అయ్యేంత వరకు తీరప్రాంత గ్రామాల్లో పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉంటుందన్నారు. భక్తులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా పోలీసులు నిర్దేశించిన ప్రాంతంలో స్నానాలు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. రూరల్ ఎస్సై శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపడతాం



నిరాహార దీక్ష చేస్తున్న రాంబాబుతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ విజయమ్మ

వేటపాలెం: పందిళ్లపల్లిలో శిథిలావస్థలో కొనసాగుతున్న పీహెచ్‌సీ స్థానంలో నూతనంగా భవన నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వ సిద్ధంగా ఉందని జిల్లా వైద్యాధికారి విజయమ్మ పేర్కొన్నారు. ఆదివారం పందిళ్లపల్లి పీహెచ్‌సీ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సందర్శించారు. నిరాహర దీక్ష చేస్తున్న రాంబాబుతో ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రావడం జరిగిందని తెలిపారు. కొత్త భవన నిర్మాణం కోసం నిధులు విడుదల కోసం ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపించామని తెలిపారు. నిధులు కూడా త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు. అందుకే రిలే నిరాహార దీక్షలు విరమించాలని కోరారు. రాంబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చేదాక రిలే దీక్ష కొన సాగిస్తానన్నారు. రిలే దీక్ష చేస్తున్న రాంబాబుకు వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాఘవ, మరికొందరు సంఘీభావం తెలిపారు. పందిళ్లపల్లి వైద్యాధికారి హర్షవర్ధన్, ఆదిత్య పాల్గొన్నారు.

యువజన వారోత్సవాలకు విశేష స్పందన



డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న రోటరీ యువజన వారోత్సవాలకు విశేష స్పందన లభిస్తోంది. చివరి రోజు ఆదివారం బాలబాలికలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 220 మంది బాలబాలికలు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా భానుకుమారి, రూపాదేవి, నవాబ్‌లు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన వారికి రోటరీ సభ్యులు నగదు బహుమతిని అందించారు. రోటరీ సభ్యులు చందలూరి బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, గుర్రం రాఘవరావు, టి.లక్ష్మీప్రతాప్, కె.ఆంజనేయులు, చీరాల కృష్ణమూర్తి, డాక్టర్ ఐ.బాబూరావు, సుభాషిణి, మామిడాల శ్రీనివాసరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, జాలాది కృష్ణ, చుక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంటల కోసం పూజలు



కారంచేడులో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: వాతావరణం అనుకూలించి సాగులో ఉన్న పంటలు బాగా పండాలని అన్నదాతలు గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు బాగా పండాలని, పంట కాలువలు సాగు నీళ్ళతో కళకళలాడాలని కోరారు. పంటలు బాగా పండుతాయని, మంచి దిగుబడులతో పాటు, గిట్టుబాటు ధరలను అమ్మవారు కల్పిస్తారని అన్నదాతలు, గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వృద్ధుడిని ఢీకొట్టిన పాల ట్యాంకర్



లారీ ఢీకొట్టటంతో దెబ్బతిన్న మోపెడ్

బల్లికురవ: టీవీఎస్ మోపెడ్‌లో రోడ్ క్రాస్ చేస్తుండగా పాల ట్యాంకర్ లారీ ఢీకొట్టటంతో ఓ వృద్ధుడు గాయాల పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం నార్కెట్‌పల్లి– మేదరమెట్ల నామ్ రహదారిలోని బల్లికురవ మండలంలోని గొర్రెపాడు క్రాస్‌రోడ్ వద్ద జరిగింది. అద్దంకి మండలం చిన కొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు పని నిమిత్తం గొర్రెపాడు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. క్షతగాత్రుడిని అద్దంకి వైద్యశాలకు తరలించారు.